విజయం ఎవరిని వరించునో?



గీతంలోని కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన టేబుల్స్

నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

- పటాన్‌చెరు నుంచి బరిలో 16 మంది
- గీతం విశ్వవిద్యాలయంలో కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి
- లెక్కింపు కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు

పటాన్‌చెరు టౌన్: ఎన్నికలు ముగియడంతో అభ్యర్థుల భవితవ్యం స్ట్రాంగ్ రూములకు చేరింది. పటాన్‌చెరు నియోజకవర్గంలో 405 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ అనంతరం ఈవీఎం, వీవీ ప్యాట్లకు సీల్ వేసి పోలీసుల బందోబస్తు మధ్య రుద్రారంలోని గీతం విశ్వవిద్యాలయంలోని స్ట్రాంగ్ రూములకు తరలించారు. శనివారం టేబుల్‌లో ఏర్పాటు ప్రక్రియ కొనసాగింది. అధికారులు ఒకవైపు.. ఆయా రాజకీయ పార్టీల తరపున మరోవైపు కంచెను ఏర్పాటు చేసి ఈవీఎం లెక్కింపు ప్రక్రియను అందరికీ కనిపించేవిధంగా ఏర్పాట్లు పూర్తి చేశారు.

18 టేబుల్స్‌లో లెక్కింపు

ఆదివారం ఉదయం ఓట్ల లెక్కింపు నేపథ్యంలో రుద్రారంలోని గీతం విశ్వవిద్యాలయంలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ ఐదు నియోజకవర్గాలకు చెందిన కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో 405 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి లెక్కింపు కోసం 18 టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు. మొత్తం 23 రౌండ్‌లో ఓట్లు లెక్కిస్తామని ఎన్నికల అధికారులు తెలిపారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు

అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించారు. మద్యం అమ్మకాలపై నిషేధం విధించారు. కౌంటింగ్ సెంటర్ల వద్ద బహిరంగ ప్రదేశాల్లో సైతం ఆంక్షలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమి కూడొద్దని, వీధుల్లో బాణసంచా కాల్చొద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా మద్యం దుకాణాలు ఆదివారం ఉదయం 6 గంటల నుంచి కౌంటింగ్ ముగిసే వరకు మూసి ఉంటాయని ఎక్సైజ్ సీఐ సీతారామరెడ్డి తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి

జహీరాబాద్: ఈ నెల 3న ఓట్ల లెక్కింపును నిర్వహించేందుకు వీలుగా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో జహీరాబాద్ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 18 టేబుళ్లలో 314 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు జరగనుంది. 17 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ఉంటుంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1,511 పోల్ అయ్యాయి. మూడు రౌండ్లలో వీటిని లెక్కిస్తారు. ఇప్పటికే ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రానికి తరలించి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చారు.



కౌంటింగ్ హాల్‌లో లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన టేబుల్స్

సమస్యల పరిష్కారానికి కృషి


కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కుమార్‌యాదవ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని సాయిరాంనగర్ కాలనీలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి కొన్నిచోట్ల మురుగునీరు రోడ్డుపైకి రావడాన్ని గుర్తించారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని పారిశుధ్య కార్మికులకు సూచించారు.

పరామర్శ

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో శుక్రవారం ఉదయం విధులు నిర్వహిస్తున్న జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికుడు యాదగిరిపై గంజాయి మత్తులో ఉన్న ఒక యువకుడు తలపై కర్రతో కొట్టి తీవ్రంగా గాయపరిచిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ శనివారం యాదగిరి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుడిపై దాడికి పాల్పడిన యువకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

ఆదినారాయణ స్వామికి పూజలు


పూజలు చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్ దంపతులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని కొడకంచి గ్రామంలోని శ్రీదేవిభూదేవి సమేత ఆదినారాయణస్వామి ఆలయంలో శనివారం పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆయన సతీమణి సుధాతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వారి కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

మానవత్వం చాటుకున్న సిద్దురావణ్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ బీఎస్పీ నాయకులు సిద్దురావణ్ మానవత్వాన్ని చాటుకున్నారు. పట్టణ సమీపంలో మహీంద్ర కర్మాగారం వద్ద జాతీయ రహదారిపై శనివారం గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా అటువైపు నుంచి వెళ్తున్న సిద్దురావణ్ చూసి వెంటనే స్పందించారు. 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి దగ్గరుండి బాధితుడిని జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఆపదలో స్పందించిన సిద్దురావణ్‌ను అభినందించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్


నృత్యం చేస్తున్న విద్యార్థులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బెల్ ఈడీ కేబీ రాజా అన్నారు. బీహెచ్‌ఈఎల్ కాలనీలోని అంబేడ్కర్ స్టేడియంలో బెల్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానసిక వికలాంగుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెల్ ఈడీ కేబీ రాజా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక వికలాంగుల అభివృద్ధి కోసం బెల్ యాజమాన్యం ఎంతో కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అంతకుముందు వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మహిళా సంక్షేమ కేంద్రం అధ్యక్షురాలు శాంతిరాజా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపుపై అవగాహన


అభ్యర్థులకు అవగాహన కల్పిస్తున్న రిటర్నింగ్ అధికారి వెంకారెడ్డి

జహీరాబాద్: ఈ నెల 3న నిర్వహించనున్న జహీరాబాద్ అసెంబ్లీ ఓట్ల లెక్కింపు ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీ అభ్యర్థుల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. జహీరాబాద్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని హమాలీ కాలనీలోని పెద్దమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి ఆలయంలోకి ప్రవేశించిన దొంగలు ఆలయ హుండీని పగలగొట్టి అందులోని డబ్బులను ఎత్తుకెళ్లారు. దొంగతనం జరిగిన దృశ్యాలు సీసీ పుటేజీలో నిక్షిప్తమయ్యాయి. బోనమ్మ పండగ నుంచి హుండీ లెక్కించలేదని, హుండీలో సుమారు రూ.25వేలు ఉండవచ్చని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇప్పటివరకు ఐదారుసార్లు ఆలయంలో చోరీ జరిగినట్లు తెలిపారు. పోలీసులు వెంటనే స్పందించి దొంగలను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌ల తరలింపు


పోస్టల్ బ్యాలెట్ లెక్కలను వివరిస్తున్న అధికారులు

నారాయణఖేడ్: ఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాట్లు చేశారు. పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నవారు బాక్సులో వేయగా అధికారులు వివిధ పార్టీల ఏజెంట్ల సమక్షంలో వాటి లెక్కను వివరిస్తూ వారి సంతకాలను తీసుకుని ఇనుపట్టెలో పెట్టి సీల్ వేశారు. మొత్తం 2,285 పోస్టల్ బ్యాలెట్లకు గాను 1,660 ఖేడ్‌లో పోలయ్యాయి. 67 ఎలక్ట్రానిక్ బ్యాలెట్లు కాగా 7 దాఖలు కాగా కౌంటింగ్ కేంద్రానికి రావాల్సి ఉంది. ఖేడ్‌లో దాఖలు అయిన పోస్టల్ బ్యాలెట్ల పెట్టెను పటాన్‌చెరు మండలం రుద్రారం సమీపంలోని గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రానికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచ్‌కు గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చిన్నగొట్టిముక్కల సర్పంచ్ బాలమణి భర్త నరేందర్, కుమారుడితో కలిసి బైక్‌పై గోమారం వైపు వస్తోంది. రోడ్డుపై ధాన్యం రాశులు ఆర బోయడంతో ఎదురుగా వచ్చిన మరోబైక్ వీరిని ఢీకొట్టింది. దీంతో బాలమణితో పాటు ఆమె భర్త, కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం నర్సాపూర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిని ఎంపీపీ హరికృష్ణ పరామర్శించారు.

వృథాగా డంప్‌యార్డు


చందూర్ గ్రామ శివారులో పడేసిన చెత్త

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చందూర్ గ్రామంలో డంప్‌యార్డు నిర్మించినప్పటికీ వినియోగంలో లేదు. గ్రామంలో నిత్యం పంచాయతీ ట్రాక్టర్‌తో గ్రామస్తుల ఇళ్ల నుంచి చెత్తను సేకరించి డంప్‌యార్డులో కాకుండా గ్రామ శివారులో పడేస్తున్నారు. అక్కడే డంప్ చేసిన చెత్త చెదారాలను కాలుస్తున్నారు. దీంతో ఆ పరిసర ప్రాంతాలు కలుషితమవుతున్నాయి. లక్షలు పెట్టి నిర్మించిన డంప్‌యార్డు ఉన్నా.. చెత్తను గ్రామ శివారులో పడేయడం ఎంతవరకు సమంజసమని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని పాలకవర్గ సభ్యులు పట్టించుకొని చర్యలు తీసుకోవాలన్నారు.

నడిరోడ్డుపై గుంత



కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మనంతయపల్లితండా పాఠశాల వద్ద మెదక్, జోగిపేట ప్రధాన రహదారిపై నడిరోడ్డుపై గుంత పడింది. అయినప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని తండావాసులు చెబుతున్నారు. తండాకు నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ లీకేజీ కావడంతో రోడ్డుపై గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్న ఇటు గ్రామ పంచాయతీ, అటు ఆర్‌అండ్‌బీ అధికారులు ఎవరు పట్టించుకోవడంలేదని తండావాసులు ఆరోపించారు. దీంతో తండావాసులు గుంత వద్ద కొమ్మలు పెట్టి గుంత కనిపించేలా చేశారు. అధికారులు స్పందించి సమస్య తీర్చాలని కోరారు.

రోడ్డు పనులు ప్రారంభం

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభమైయ్యాయి. మండలంలోని పోతులబోగూడ నుంచి ఉసిరికపల్లి, చెండి నుంచి అనంతారం చౌరస్తా వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసం అయింది. అందుకు సంబంధించిన నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించారు. సింగిల్‌రోడ్డు ఉండగా డబుల్ రోడ్డుగా మార్చేందుకు ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసింది. పెరిగిన వాహనాల రద్దీకి అనుగుణంగా డబుల్ రోడ్డు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఏళ్ల క్రితం నుంచి పాడైపోయిన రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులు

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

- ముస్తాబైన జీవన్ముక్త సంస్థానం
- ఈ నెల 7నుంచి 11వ తేదీ వరకు ఉత్సవాలు
- వివిధ జిల్లాల నుంచి తరలిరానున్న భక్తులు


ఉత్సవాలకు ముస్తాబైన జీవన్ముక్త సంస్థానం

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని అంతారం జీవన్ముక్త మహారాజ్ సంస్థానం ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 7నుంచి 11వ తేదీ వరకు శిఖర స్థాపన, గరుడ వాహనం, మహపూజ, రథోత్సవాలను జీవన్ముక్త సంస్థాన పీఠాధిపతి బాల్‌రాజ్ జ్ఞానేశ్వర్ మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. జీవన్ముక్త సంస్థానంలో పాండురంగ విఠలేశ్వర రుక్మాబాయి దేవతామూర్తులకు భక్తులు, సంస్థాన పీఠాధిపతి బాల్‌రాజ్ జ్ఞానేశ్వర్ మహారాజ్ ఆధ్వర్యంలో నిత్య పూజలు జరిపిస్తారు.

ఆలయ చరిత్ర..

జీవన్ముక్త మహారాజ్ పాండురంగడు విఠలేశ్వర రుక్మాబాయి దేవతామూర్తుల మహారాష్ట్రకు చెందిన భక్తుడు జీవన్ముక్త మహారాజ్ సుమారు 400 ఏళ్ల క్రితం ఆయా ప్రాంతాలతో పాటు జిల్లాలను తిరుగుకుంటూ మునిపల్లి మండలంలోని అంతారానికి తన భార్య, నలుగురు కుమారులను తీసుకుని వచ్చాడు. దీంతో అంతారంలో జీవన్ముక్త మహారాజ్ పాండరిపూర్ పండరినాథ్ మహారాజ్, విఠలేశ్వర రుక్మాబాయి దేవతామూర్తులను అంతారంలో ప్రతిష్టించాడు. కొంతకాలం తర్వాత జీవన్ముక్త మహారాజ్ జీవన్ముక్త సంస్థానంలోనే జీవసమాధి అయినట్లు అంతారం గ్రామస్తులు చెబుతున్నారు. అప్పటి నుంచి భక్తులు ప్రతి ఏడాది డిసెంబర్ 7నుంచి 11వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించేందుకు సంస్థాన పీఠాధిపతి బాల్‌రాజ్ జ్ఞానేశ్వర్ మహారాజ్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలకు కర్నాటక, మహారాష్ట్ర, నిజామాబాద్ జిల్లాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వచ్చి పూజలు నిర్వహిస్తారు.

జీవసమాధులకు ప్రత్యేక పూజలు

జీవన్ముక్త మహరాజ్ జీవసమాధి అయిన స్థలంలోనే ఆయన నలుగురు కుమారులు కాశినాథ్, విఠోభ, వెంకోబ, మాణిక్ మహారాజ్‌లు జీవసమాధి అయినట్లు భక్తులు చెబుతున్నారు. దీంతో వారికి ప్రతి సంవత్సరం జీవన్ముక్త మహారాజ్ ఉత్సవాల్లో భాగంగా జీవసమాధులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అదేవిధంగా ప్రతి గురువారం భజనతో పాటు పల్లకీ సేవా నిర్వహిస్తారు. అందోల్ నియోజకవర్గ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎవరూ పోటీ చేసినా ముందుగా జీవన్ముక్త మహారాజ్, విఠలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తుల పాదాల దగ్గర నామినేషన్ పత్రాలను పెట్టి మొక్కడం అనవాయితీగా వస్తోంది.


పాండురంగ విఠలేశ్వర రుక్మాబాయి దేవతామూర్తులు

అంతారం ప్రత్యేకత

అందోల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే ఆ పార్టీ అధికారంలోకి వస్తుందని రెండు రాష్ట్రాల్లోని అధినాయకులకు గట్టి నమ్మకం. నామినేషన్ వేసే ముందు, గెలిచిన తర్వాత అంతారంలో దేవతామూర్తులను దర్శించుకున్న తర్వాతే ఇతర పనులు ప్రారంభిస్తారనే ప్రచారం ఉంది.

క్లుప్తంగా

ఆయాకు వేతనం అందజేత


పద్మమ్మకు వేతనం ఇస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం మున్సిపల్ ఎంపీపీఎస్ పాఠశాలలో ఆయాగా పనిచేస్తున్న పద్మమ్మకు కాంగ్రెస్ నేత, మున్సిపల్ వైస్‌చైర్మన్ అంతిరెడ్డి అనిల్‌కుమార్‌రెడ్డి తన సొంతంగా రూ.10వేలను అందజేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, పాఠశాల అభివృద్ధికి సహాయ, సహకారం అందిస్తానని తెలిపారు.

ఆరోగ్య రక్షణపై అవగాహన


కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

నారాయణఖేడ్: మండల పరిధిలోని జూకల్ శివారులోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆరోగ్య పరిరక్షణపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యులు నారాయణ రావు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. అనారోగ్యం బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్యజీవనశైలికి పాటించాల్సిన జాగ్రత్తలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండటం, ఆహార అలవాట్లు, పౌష్టికాహారం తీసుకోవడం, యోగాసనాల ఆవశ్యకత తదితర అంశాలను సమగ్రంగా వివరించారు. అనంతరం టీచర్లు, విద్యార్థులను పరీక్షించి ఆయుర్వేద మందులు, పౌడర్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌గౌడ్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన


మాట్లాడుతున్న నాగభూషణం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ కాలనీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిపోయిన రామస్వామియాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ మెడికల్ అధికారి నాగభూషణం, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేదార్‌నాథ్ ఆలయ అర్చకుడికి సన్మానం


శివలింగ్‌స్వామిని సన్మానిస్తున్న గ్రామస్తులు

నారాయణఖేడ్: కేదార్‌నాథ్ ఆలయ ప్రధాన అర్చకులు శివలింగ్‌స్వామి శుక్రవారం రాత్రి తన స్వగ్రామమైన నారాయణఖేడ్ మండలం చాప్టా(కె) గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యుడు కర్నె శ్రీనివాస్‌తో పాటు గ్రామస్తులు ఆయనను గజమాలతో సన్మానించి ఆశీస్సులు పొందారు. తమ గ్రామానికి చెందిన శివలింగ్‌స్వామి దేశంలోనే ప్రధాన ఆలయాల్లో ఒకటైన కేదార్‌నాథ్ ఆలయంలో ప్రధాన అర్చకుడిగా నియమితులై కొనసాగడం ఖేడ్ ప్రాంతానికే గర్వకారణమని గ్రామస్తులు తెలిపారు.

భారీ మెజార్టీతో విజయం సాధిస్తాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీఆర్‌ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని రామచంద్రాపురం మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని రూ.వేల కోట్లతో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అభివృద్ధి చేశారన్నారు. తన సొంత నిధులను సైతం అభివృద్ధి పనులకు ఖర్చు చేశారని తెలిపారు. భారీ మెజార్టీతో విజయం సాధించబోతున్నామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ అయ్యప్పస్వామి ఆలయంలో మహా పడిపూజ శనివారం ఘనంగా నిర్వహించారు. పడిపూజలో అయ్యప్ప మాలాధారణస్వాములు అధికసంఖ్యలో పాల్గొన్నారు. గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన పడిపూజలో 18 మెట్లను ఏర్పాటు చేసి జ్యోతులను వెలిగించారు. అయ్యప్ప నామస్మరణ భక్తి గీతాలను ఆలపించారు. అయ్యప్ప పడిపూజ అనంతరం అయ్యప్ప మాలాధారణస్వాములకు తీర్థప్రసాదాలను అందజేశారు.